## ఆశల తీరాలకు
## పరుగులెత్తిన
## ఆ జంట
## తెలుసుకున్న నిజం?

# నల్లబంగారం

## విన్నకోట సుశీలాదేవి కథ

బొగ్గు బావిలో పనిచేసే మైసన్న వచ్చాడంటే ఆ పేటంతా ఒకటే సందడి. ఆ పేటలో వుండేవాళ్లందరకు ఏవేవో కానుకలు తెస్తుంటాడు! తను పనిచేసే చోట జరిగే విశేషాలు ఎంతో వర్ణించి చెప్తుంటాడు.


అతడొస్తే అందరికీ పెద్ద ఆటవిడుపులా వుంటుంది! దాదాపు ఆరు నెలల తర్వాత ఇప్పటికి వచ్చాడు మైసన్న! అతడొచ్చాడని తెలీగానే అందరూ అతని చుట్టూ మూగిపోయారు. తను తెచ్చిన చిన్న చిన్న కానుకలు వాళ్లకే పంచి పెట్టాక అక్కడి విశేషాలు చెప్పడం మొదలుపెట్టాడు!

''ఒకసారి బావిలో బొగ్గు విరిగి పడింది! అది తెలిసి చిన్నదొరలు, పెద్ద దొరలు వచ్చారు. తీరా చూసి ఆ బొగ్గురాయికింద ఒకడు ఇరుక్కుపోయాడు! రాళ్లు పక్కకు తీసి వాడిని బయటకు తీశారు. కొనప్రాణంతో ఉన్న వాడిని దవాఖానాలో చేర్చారు'' అని చెప్పి చుట్ట వెలిగించుకోడానికి ఆగాడు మైసన్న. చుట్టూ చేరినవాళ్లు నోళ్లు తెరుచుకుని వింటున్నారు.

''దవాఖానాలో సేరిస్తే సచ్చినోడికిందే లెక్క. అంతేకదూ బాబాయ్!'' ఎవరో అన్నారు.

మధ్యలో కల్పించుకుని మాట్లాడితే మైసన్నకు చాలా చిరాకు. ''ఒరేయ్ అబ్బిగా! నీకంత తొందర కూడదురా! దవాఖానా అంటే మనూరిలో వున్నలాటిది అనుకున్నావా! ఎర్రిమొగమా! అది సొరగంరా! అబ్బ ఎంత బాగుంటాదో. కింద నేల నున్నగా కాలేస్తే జారేట్లుంటాది! తెల్లగా మెరిసిపోయే గోడలు. అక్కడి డాకటేరులు, నర్సమ్మలూ అందరూ దేవతల్లా వుంటారు. ఎంతో సక్కటి మందులిత్తారు!''

''ఆ రాయికింద పడినోడి సంగతి సెప్పనేలేదు''



''ఆ అదే సప్పబోతున్నారా. ఆడికి కాళ్ళు విరిగాయి. ఒక కాలు మోకాలివరకూ తీసేశారు. అయినా ఆడిమీద జాలి చూపించకండొరే. కాలు పోయినందుకు ఆడికి లచ్చ ఇచ్చా(రా! ఎంతో తెలుసా... లచ్చ... ఒరేయ్ సన్నాసుల్లారా మీరెప్పుడైనా లచ్చ చూశా(రా...'' వైసన్న అడిగాడు.

''అబ్బే... లేదు!'' అందరూ

ఒప్పేసుకున్నారు.

''నా కళ్లతో చూశాన్రా లచ్చని... అప్పుడన్పించింది సచ్చినా అలాగే సావాలని... ఆ బొగ్గు బావుల్లో పని దొరకడం నా అదురుట్టంరా'' అన్నాడు మైసన్న.

అందరూ ''నిజమే... నిజమే'' అంటూ మైసన్న అదృష్టాన్ని పొగిడారు!

''సరే! ఈ సారి నాతో ఎవరొస్తారో మీరే తేల్చుకోండి! నేను మళ్లీ వచ్చేవారమే ఎళ్లిపోతన్నా... ఆలోచించుకుని సెప్పండి'' అని లేచాడు మైసన్న!

మిగతావాళ్లుకూడా లేచి ఇంటిదారి పట్టారు! మైసన్న మాటలు విని అందరూ అతనితో వెళ్లిపోవాలని ఆరాటపడిపోయారు! కానీ మైసన్న అందర్నీ తీసుకుపోడు! ముందు వాళ్లతనికి నచ్చాలి! దానిక్కిముందు వాళ్లు తమ నిజాయితీని, నమ్మకాన్ని నిరూపించుకోవాలి! ఆ తర్వాతే అతనితో వాళ్లు వెళ్లగలరు. ఎవరికివారు ఆ అదృష్టం తమకి పట్టాలని కోరుకుంటున్నారు!

★ ★ ★

రాములు వ్యవసాయ కూలీ! అతని ఇల్లు మైసన్న ఇంటి ప్రక్కనే. రాములు భార్య లక్షువమ్మ కూడా మొగుడుతో కలిసి కూలిపనికి వెడుతుంది. ఆ పనులైనా సంవత్సరం అంతా వుండవు. సంవత్సరంలో మూడు నెలలు పస్తులుండాల్సిందే. వాళ్లకి ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు. ఒక కూతురు. మైసన్న వచ్చాడని తెలీగానే ఇద్దరూ అతనింటికి వెళ్లారు. అతను చెప్పిన మాటలన్నీ విన్నారు.

అందరిలాగే రాములు. ఈసారి మైసన్న వెంట వెళ్లే అదురుట్టవంతుడెవరో?'' అనుకున్నాడు.

లక్షువమ్మ ''మనమే ఎందుక్కాకూడదు?'' అంది!

రాములు తెల్లబోతూ ''అంటే!'' అన్నాడు.

''మనం మైసన్న వెంట పోదాం!'' అంది.

''మనమా? ఎందుకే! మనకిక్కడ బానేవుందిగా!'' అన్నాడు

''ఏం బాగు...రోజల్లా వొళ్లు విరుచుకున్నా పది రూపాయలు మిగలడంలేదు... ఇక్కడేముంది మనకు?'' మూతి ముడుస్తూ అంది లక్షువమ్మ.

''అక్కడ మనకేం తెలుసు?'' అన్నాడు రాములు భార్య ధోరణికి కంగారుపడుతూ!

''మైసన్నలేడూ. అతనే... అన్నీ సెప్తాడు!''

''అవుననుకో! కానీ సిన్నప్పట్నించీ తిరిగిన ఊరు. దీన్ని వదిలి ఎలా పోతామే?''

''వూ...వొదిలెయ్యకు! పట్టుకుని వేళ్లాడు. ఇక్కడేముందని నీకింత అభిమానం! మనకున్న ఒక్కగానొక్క మగబిడ్డకు సదువయినా సెప్పుకోవద్దు? ఆడికి పెద్ద సదువు సెప్పించి మనం ఆడిని గొప్పోడిని చెయ్యాలా? వద్దా'' అంటూ రాములు కాళ్లకు బంధం వేసింది.

భార్య అడిగిన ప్రశ్నకు ఎటూ చెప్పలేక... ''అవునే గొప్పోడిని సెయ్యాల!'' అన్నాడు.

''దానికి మరి డబ్బు కావొద్దూ!''

''చూడయ్యా! మనం కష్టం చేసేవాల్లం... ఎక్కడ నాల్గు డబ్బులొస్తాయో అక్కడికి పోతాం! మనలాటోళ్లకి ఒక ఊరేమిటి? ఒక ఇల్లేమిటి?''

''చూడయ్యా'' అంటూ రాములికి దగ్గరగా జరిగి ''మనం మైసన్నతో ఎళ్లిపోదాం... మనమంటే మైసన్నకెంతోఇట్టం. మనల్ని తప్పక తీసుకెడతాడయ్యా... ఎంటనే ఎళ్లి మైసన్నతో మాట్లాడయ్యా...'' అంటూ మెల్లగా చెప్పింది''

రాములికా మాటలు బాగా తలకెక్కాయి.

తనూ మైసన్నలా డబ్బు సంపాదించాలి. తన కొడుకు తనలా కూలోడు కాకూడదు. ఆడిని బాగా సదివించి గొప్పోడిని సెయ్యాల... అనుకుంటూ...

''అలాగేలేవే... మైసన్నతోమాట్లాడతాలే'' అన్నాడు రాములు.

మొగుడు తన మాట విన్నందుకు చాలా సంతోషించింది లక్ష్మమ్మ!

★ ★ ★

రాముల్ని తనతో తీసుకెళ్లడానికి మైసన్న అంగీకరించాడు. రాములు, లక్ష్మమ్మ మైసన్నతో వెళ్లడానికి సన్నాహాలు మొదలెట్టారు. చుట్టుప్రక్కలవాళ్లకివ్వాల్సిన చిన్న చిన్నబాకీలు తీర్చేశారు. తమకున్న సామాన్లని రెండు గోతాముల్లో - ఒక చెక్కపెట్టెలోనూ సర్దేశారు! మైసన్నతో బయలుదేరారు.

తీరా ఊరు దాటుతుంటే రాములుకి ఎంతో దిగులు కలిగింది. పుట్టి పెరిగిన ఊరును వదులుకుని ఎక్కడికో తెలియని చోటుకు వెళ్లిపోతున్నాడు. అక్కడ ఎలా వుంటుందో! పని దొరుకుతుందో? లేదో మనసులో ఎంతో గుబులుగా వుందతనికి. కాని లక్ష్మమ్మకి మాత్రం చాలా సంతోషంగా వుంది. ఇన్నాళ్లకి తమకు మంచిరోజులొచ్చాయి. మైసన్న బొగ్గుబావిలో పనిచేసి బోలెడు డబ్బు సంపాదించాడు. తాముకూడా మైసన్నలా సంపాయిత్తే అందరూ తమని చూసి ఎంత ఏడుత్తారో...

ఇలా సాగాయి ఆమె ఆలోచనలు!

ఊళ్లో పెద్దలు కొందరు పుట్టి పెరిగిన ఊరు వదలొద్దని చెప్పబోయారు. కానీ లక్ష్మమ్మ వినలేదు.

''మనం మైసన్నతో పోతున్నామని ఏడుత్తున్నారయ్యా! ఆళ్ల మాటలువినమాక...'' అంటూ రాముల్ని లాక్కెళ్లిపోయింది.

రాములు నిజమే అనుకుని వాళ్ల మాటలు పెడచెవిన పెట్టాడు!

ఊరుదాటాక దిగులుగా వున్న రాములికి భవిష్యత్తుపై ఆశలురేపి అతని దిగుల్ని పోగొట్టడానికి ప్రయత్నించింది లక్ష్మమ్మ!

★ ★ ★

బొగ్గుకు నల్ల బంగారం అని పేరు. ఆ పేరు పెట్టడంలోనే దానియొక్క విలువ తెలుస్తోంది! ఈ రోజు మనిషి మనుగడ విద్యుచ్ఛక్తిపై ఆధారపడితే విద్యుచ్ఛక్తికి మూలం బొగ్గు. ఇంత అవసరమైన బొగ్గు

## సాధ్వి

''నాకు చెప్పకుండా మా ఆవిడ ఏ పనీ చేయదు'' గొప్పగా అన్నాడు శరత్.

''ఆహా! అలాగా ఆమె అంతటి సాధ్వా?'' అడిగాడు మధు.

''అవును. నేను స్నేహితులతో మార్నింగ్‌షోకి వెళ్తున్నాను. వంటచేసి రెడీగా వుంచండి అని చెప్పి మరీ సినిమాకి వెళ్తుంది''

- పి.నాగభూషణం (అమలాపురం)



భూగర్భంలో లభిస్తోంది. దానిని వెలికితీయడం ఒక పెద్ద పని. లక్షల కార్మికులు ప్రతిరోజూ కొన్ని వేల టన్నుల బొగ్గును వెలికితీస్తున్నారు!

బొగ్గుగనులు ప్రభుత్వానికి, ప్రజలకు బంగారు గనుల్లా వుంటే కార్మికులకు అవి మృత్యుద్వారాలు. గనిలోకి వెళ్లి తిరిగివచ్చి ప్రతిరోజూ ఆ కార్మికులకు ఒక పునర్జన్మే. దేవుడిమీద భారం వేసి బ్రతుకు సమరం సాగిస్తుంటారు ఆ కార్మికులు.

రాములు కోల్ ఫిల్లర్. అంటే గనిలో బొగ్గు ఏరి టబ్స్‌లో నింపే పనిలో చేరాడు! మొదటిరోజు గనిలో ప్రవేశించడానికి రాములు భయపడ్డాడు. గనిలో లోపలంతా చీకటిగా తడిగా వుంది. గునపంతో బొగ్గుని తవ్వుతుంటే ఏక్షణంలోనైనా కుప్పకూలుతుందేమోనని భయం. దీంతో మొదటిరోజుల్లో రాములు రెండు మూడు టబ్స్‌కంటే నింపలేకపోయేవాడు. అతని రోజు సంపాదన యాభై. అదే అతనికి గొప్పగా వుంది. పల్లెటూర్లో రోజల్లా పొలంలో కష్టపడితే వచ్చేది ముప్పై. కాని ఇక్కడ వారానికి ఐదొందలు సంపాదించుకుంటున్న వాళ్లున్నారు. బొగ్గుపని అలవాటు పడితే తనూ సంపాదించొచ్చు అనుకున్నాడు రాములు.

మొదటినెల గడిచేసరికి ఆ వాతావరణం సరిపడక రాములుకు దగ్గు, జ్వరం వచ్చాయి. ఎప్పుడూ అనారోగ్యం ఎరగని రాములు భయపడిపోయాడు.

''కొత్తగదా! అదే సర్దుకుంటుందన్నా! ఏం భయపడమాక'' అంటూ చుట్టుప్రక్కలవాళ్లు ధైర్యం చెప్పారు.

''ఇది సాకుగా తీసుకుని ఊరికి పోతానంటేడేమోనని లక్షువమ్మ భయపడిపోయింది. రాములుకు త్వరగా నయం కావాలని అనేక దేవుళ్లకు మొక్కింది. చివరకు ఎలాగైతేనేం రాములికి ఆరోగ్యం చిక్కింది!

ఆరు నెలలు గడిచాయి!

రాములుకిప్పుడు బొగ్గుపని అలవాటయింది! వారానికి రెండొందలు తక్కువ లేకుండా సంపాయిస్తున్నాడు! మరొక్క ఆరు నెలలు గడిస్తే అతని ఉద్యోగం పర్మనెంట్ కూడా అయిపోతుంది.

లక్షువమ్మ మొగుడి సంపాదన చూసి మురిసిపోయింది.

ఎంతడబ్బో! ఆ పల్లెటూళ్లో వుంటే ఏం వస్తుంది. మైసన్న పున్నెమా అని ఏదో నాలుగురాళ్లు కళ్లచూస్తున్నాం! ఈ డబ్బులో కొంత ఎనకేత్తే ఆడపిల్లకి మంచి సంబంధం సూడొచ్చు!'' అనుకుంది!

రాములు తను పరమనెంట్ అయిపోతే చాలు! అనుకుంటున్నాడు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఒక సంఘటన జరిగింది.

★ ★ ★

బొగ్గుగని కార్మికులు సమ్మె మొదలెట్టారు!

ఒకరోజు రాత్రి హఠాత్తుగా లీడర్లు వచ్చి ''రేపట్నించీ మీరందర్వూ సమ్మె చేయాలి'' అన్నారు.

రాములుకు అర్థం కాలేదు. ''సమ్మె అంటే ఏంటయ్యా!'' అనడిగాడు.

రాములు ప్రశ్నకు నవ్వి ''సమ్మె అంటే పనిలోకి పోకుండా ఇంట్లో కూసోడం'' అన్నాడొకడు.

ఆ మాట విని రాములు తెల్లబోతూ ''పనిలోకి పోకుంటే డబ్బులెలా వొస్తయ్యి'' అనడిగాడు.

''డబ్బులు రావు... ఇంట్లో వున్న డబ్బులు ఖర్చెట్టుకొండి. లేకపోతే పస్తులతో సావండి!'' ఎవడో కసిగా అన్నాడు.

రాములు దిగులుపడిపోయాడు.

''ఎన్నాళ్లుంటుందయ్యా సమ్మె?''

"ఏమో. ఏరికోరిక? మన కోరికలన్నీ తీర్చాలి మన దొరలు... అప్పుడే మనం పనిలోకి పోవాలి"

"మన కోరికలేంటయ్యా?"

"ఇదిగో సూడండి. రేపు సాయంత్రం అయిదు గంటలకు సెంటర్లో మీటింగుంది. అక్కడ మన కార్మిక నాయకులు మాట్లాడతారు! మీరు వచ్చి విన్నారంటే మీ సందేహాలన్నీ తీరతాయి! అందరూ తప్పక రావాలి" అని చెప్పి వెళ్లిపోయారు.

ఆ సాయంత్రం ఐదు గంటలకు సెంటర్లో జరిగే మీటింగ్‌కి వెళ్లారు రాములు, లక్షుమమ్మ.

ఒక పొడుగు వ్యక్తి మైక్‌ముందు నిలబడి ఆవేశంతో ఊగిపోతూ మాట్లాడుతున్నాడు.


"చూడండి కామ్రేడ్స్. మనం రోజా మృత్యువుతో చెలగాటమాడుతూ బొగ్గుని తవ్వి తీస్తున్నాం! ఏ మాత్రం రక్షణ లేని ఈ గనుల్లో అనారోగ్యానికి కారణమైన వాతావరణంలో పనిచేస్తూ ఈ ప్రభుత్వం ఖజానాలు నింపుతున్నాం. ఇంతటి భయంకరమైన వాతావరణంలో పనిచేస్తున్న మనకిచ్చేది పాతిక ముప్పై. ఎయిర్ కండిషన్డ్ గదుల్లో కూర్చుని కార్లలో తిరిగే అధికారులకు వేలల్లో జీతాలు. మనకి రోగం వచ్చినా బొగ్గురాయి మీదపడి చచ్చినా ఎవ్వరూ పట్టించుకోరు. మన కుటుంబాలు వీధిన పడి అడుక్కోవాల్సిందే! అదే అధికారికి ఏదైనా జరిగితే వాళ్లకు ఎంతో సానుభూతి చూపుతారు. ఈ ఎక్కువ తక్కువ తేడాలు నశించాలి. కార్మికుని శ్రమకు తగిన గుర్తింపు వుండాలి. మనకు క్రొత్త జీతాలు ఇవ్వాలి. అంతేకాదు. గనుల్లో పనిచేసే కార్మికులకు తగిన రక్షణ సౌకర్యాలు కల్పించాలి. మనకేమైనా ప్రమాదం జరిగితే అధికారులు మనల్ని ఆదుకోవాలి. మన స్థానంలో మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి. ఇటువంటి డిమాండ్లన్నీ మొత్తం పదకొండు ఉన్నాయి. వీటన్నింటినీ మన అధికారులు ఆమోదించేవరకూ మీరెవ్వరూ పనిలోకి వెళ్లరాదు. మనమందరమూ ఐకమత్యంగా వుండాలి! ఎవ్వరూ ఎట్టి ప్రలోభాలకు లొంగిపోరాదు. మనం కలసికట్టుగా పోరాడితే ప్రభుత్వమే దిగివస్తుంది. మీరేమీ భయపడకండి. మీ ముందు మేమున్నాం" అన్నాడు!

అందరూ మాట్లాడాక మీటింగై ఇంటికొచ్చేసరికి పదకొండు దాటింది.

ఆ రాత్రి రాములికి, లక్షుమమ్మకి నిద్రపట్టలేదు.

## టాప్‌స్టార్స్!

ఈ మధ్య జరిగిన ఓ సర్వేలో సినీ నిర్మాతల దృష్టిలో అక్షయకుమార్, గోవింద, షారూఖ్ ఖాన్, అనిల్‌కపూర్, సన్నీడియోల్‌లతో సినిమా తీస్తే ఎలాంటి ఢోకా వుండదని అనుకుంటున్నారు. అదే హీరోయిన్ల లిస్టుకు వస్తే కాజోల్, శిల్పాశెట్టి, జూహీచావ్లా, కరిష్మా, మాధురీ దీక్షిత్‌లు టాప్‌లో వున్నారు. సో కంగ్రాట్స్ టూ దీజ్ టెన్ స్టార్స్!!



- జూపిటర్

తమ పల్లెటూళ్లో కష్టించి పనిచెయ్యడం, తమకేదైనా కావాలిస్తే పెద్ద దొరని అడిగి తెచ్చుకోవడమే కానీ ఇలా సమ్మె చేయడం వాళ్లెప్పుడూ ఎరుగరు. చివరికీ సమ్మె ఏమవుతుందో? తమ బ్రతుకులేమవుతాయెనోనని వాళ్లు బెంగ పెట్టుకున్నారు!

★ ★ ★

ఒక వారం గడిచింది.

సమ్మె జరుగుతూనేవుంది.

అధికారులతో కార్మిక నాయకులు జరిపిన చర్చలు ఫలించలేదు. మా కోర్కెలన్నీ తీరిస్తేగానీ పనిలోకి వచ్చేది లేదని ఖచ్చితంగా చెప్పారు. ఉన్న బొగ్గు నిల్వలు తరిగిపోతున్నాయి. బొగ్గు లేకపోతే విద్యుచ్ఛక్తి లేదు! విద్యుచ్ఛక్తి లేకపోతే యంత్రాంగమే స్తంభించిపోయింది!

ఒక రాత్రి కార్మికులున్న పేటకి కొంతమంది మనుషులొచ్చారు. నిద్రపోతున్న రాముల్ని లేపి, పేట చివరనున్న మైసమ్మ గుడిదగ్గరకు తీసుకెళ్లారు. అక్కడొక పాతికమంది కార్మికులున్నారు. ఆ వచ్చినవాళ్లు ''చూడండి. మీరందరూ కొత్తగా ఈ పనిలోకి వచ్చారు. ఇంకా పర్మనెంట్ కాలేదు! ఇటువంటి సమయంలో మీరు సమ్మె చేయడం అంత మంచి పనికాదు. మీమీద పై అధికార్లకు కోపం వస్తుంది! మిమ్మల్ని పనిలోనుండి తీసేయవచ్చు! అందుకని పై అధికార్లకు కోపం రాకుండా మీరు రేపటినుండి పనిలోకి రండి! పని చేస్తున్నందుకు డబ్బు వస్తుంది. మీరు పర్మనెంట్ అవుతారు'' అంటూ మెల్లగా చెప్పాడు.

రాములుకు వాళ్ల మాటలు నచ్చాయి. అవును వాళ్లు చెప్పినట్లు అధికార్లకు కోపం వస్తే పనిలోనుండి తీసేస్తారేమో? అనుకున్నాడు. కానీ తనకు పనిలోకి వెళ్లాలని వున్నా తమ నాయకులు వెళ్లనివ్వరేమో? అని సంశయించాడు.

అదే భయాన్ని వాళ్లముందు వ్యక్తం చేశాడు. వాళ్లు ధైర్యం చెప్పారు. మీకేం పర్వాలేదు. మీరందరూ అంగీకరిస్తే మిమ్మల్ని మేం గనుల దగ్గరకు తీసుకెడతాం'' అన్నారు.

అందరూ అంగీకరించారు!

''రేపు ఉదయం సిద్ధంగా వుండండి... వస్తాం!'' అని చెప్పి వాళ్లు వెళ్లిపోయారు.

అందరితోపాటు రాములు ఇంటిదారి పట్టాడు. లక్షువమ్మ రాములుకోసం ఎదురుచూస్తూ పాకముందు కూర్చుంది! రాములు రాగానే ''ఏంటయ్యా! ఏం జరిగింది?'' ఆత్రంగా ప్రశ్నించింది. రాములు జరిగింది చెప్పాడు. అది వినగానే లక్షువమ్మ ముఖం వెలిగిపోయింది!

''కాని... నాకేదో భయంగా వుందే!'' అన్నాడు రాములు.

సమయానికి మైసన్నకూడా వూళ్లో లేడు'' దిగులు పడ్డాడు. లక్షువమ్మ మొగుడికి ధైర్యం చెప్పింది.

''ఎందుకయ్యా భయం! మన బతుకు మనిట్టం! ఇయ్యాల్టికి పదిరోజులైపాయె సమ్మె మొదలెట్టి. ఆళ్లు బాగా సంపాయించారు కాబట్టి హాయిగా తిని కూసుంటున్నారు! మనలాటోళ్లం కడుపు కాల్చుకుని సత్తున్నాం. పైసల్లేవంటే ఒకరోజొచ్చి కిలో బియ్యమిచ్చిపోయారు. మల్లా మన ముకమే సూడలా! అటువంటోళ్లని సూసి బయమెందుకయ్యా. దొరలమాట ఇంటే డబ్బొ వస్తది. పని నిలుస్తాది. ఇంకేం ఆలోసించమాక... ఎవరితోనూ ఏం సెప్పమాక... రేపు ఆళ్లతో కలిసి పనిలోకెల్లు... ఆ దొరలే మనల్ని కాపాడతారు'' అని లక్షువమ్మ నచ్చచెప్పింది.

పెండ్లాం మాటలు రాములికి ఎంతో ధైర్యాన్నిచ్చాయి. మర్నాడు పనిలోకి వెళ్లాలనే

నిర్ణయించుకున్నాడు!

★ ★ ★

''రాములూ సమ్మె కాందే పనిలోకి పోతున్నావంటగా! అది మంచిదికాదు. మన నాయకులకు తెలిస్తే కోపగిస్తారు'' ఆ పేటలోవాళ్లు నచ్చచెప్పబోయారు.

రాములికి బదులు లక్షుమమ్మ ముందుకు వచ్చి సమాధానం చెప్పింది!

''సొల్లేవయ్యా!నాయకులట... నాయకులు ఆళ్లు ఏం సేస్తారు? దొరల మాట వింటే మనకు లాబం... డబ్బొస్తాది, మంచి పని ఇస్తారు''

''మీకు కొత్త. ఇక్కడి ఇసయాలు తెలీవు. దొరలు మీరనుకునేంత మంచోల్లు కాదు. నాయకులు మనకోసరం పోరాడుతున్నారు. ఆళ్లకు సెప్పండి. మీక్కావాల్సినవన్నీ సేస్తారు. ఆళ్ల మాట ఇనకపోతే మీకే నష్టం. మీరు సెడిపోతారు''

''మేమేం సెడిపోవయ్యా! మా బతుకు మా ఇట్టం. ఇంక సూత్తావేంటి నువ్వెళ్ళు'' అంటూ మొగుడిని లారీ ఎక్కించింది లక్షుమమ్మ.


రాములుతోపాటు మొత్తం యాభైమంది... గనిలోకి ప్రవేశించారు. ఎప్పటిలానే బొగ్గు గునపాలతో తవ్వి టబ్స్‌లో నింపుతున్నారు.

''మీరెన్ని టబ్స్‌నింపితే అంతకు రెట్టింపు సంపాయించొచ్చు! మీ ఓపిక చూసుకోండి!'' అక్కడున్న కార్మికులని రెచ్చగొడుతున్నారు.

ఇన్నాళ్ల నష్టం పూడ్చుకోవాలని రాములుతోపాటు మిగతా వాళ్లందరూ రెట్టింపు ఉత్సాహంతోపనిచేస్తున్నారు.

నాల్గు రోజులు గడిచాక ఒకరోజు ఉదయం అనుకోని సంఘటన జరిగింది! గని లోపలి బొగ్గు పొరల్ని ఛేదించడానికి డ్రిల్ మెషీన్స్ సహాయంతో బొగ్గు ముఖానికి 6నుండి 12 అడుగుల పొడవుగల రంధ్రాలు చేస్తారు. ఆ తర్వాత ఈ బొరియల్లోమందుతో నిండిన తూటాలను నింపుతారు. మందు నింపిన పిదప డిటొనేటర్ అనే ప్రేలుడు ఏజెంట్‌ను మందు మీద ఉంచుతారు. దానికి ఉన్న వైర్లను బయటకులాగి సిరీస్‌లో కలుపుతారు. ప్రేలుడు జరుపబోయేముందు కార్మికుల్ని దూరంగా పొమ్మని హెచ్చరించి, ప్రేలుడు జరుపుతారు.

ఆ ఉదయం కూడా భయంకరమైన చప్పుడుతో



ప్రేలుడు సంభవించింది. సాధారణంగా ప్రేలుడు జరిగాక ఆ రూఫ్‌ని బాగా పరీక్షించాక కార్మికుల్ని బొగ్గు ఏరడానికి పంపిస్తారు.

కాని తక్కువ వ్యవధిలో ఎక్కువ బొగ్గును సమకూర్చాలనే ఉద్దేశ్యంతో ప్రేలుడు జరిగాక రూఫ్‌ని బాగా పరీక్షించకుండానే కార్మికుల్ని బొగ్గు ఏరడానికి పంపించడం జరిగింది. ఫలితంగా రాములు బొగ్గు టబ్స్‌లో నింపుతుంటే రూఫ్ కూలడానికి ముందు వచ్చే కర్‌కర్ శబ్దం వచ్చింది. రాములు భయంతో పరుగెత్తబోయేటంతో రూఫ్ కూలి రాములుమీద పడింది. రాములు పెద్దగా అరవడంతో ఆ ప్రక్కనున్న వాళ్ళు రాముల్ని బయటకు లాగడానికి ప్రయత్నించారు. ఇంతలో మరో పెళ్ల విరిగి రాములు కాళ్లమీద పడింది! రాములు భయంకరంగా అరిచి. స్పృహ కోల్పోయాడు!

★ ★ ★

రాములు మళ్లీ కళ్లు తెరిచేసరికి హాస్పిటల్ డాక్టర్లు, నర్సులు కనబడ్డారు. రాములు మంచం ప్రక్కన లక్ష్మమ్మ ఏడుస్తూ కూర్చుని వుంది!

''ఏమైందే నాకు!'' ప్రక్కకు ఒత్తిగిలబోయాడు రాములు. కాళ్లదగ్గర విపరీతమైన బాధ ''అమ్మా'' అంటూ మూలిగాడు.

''ఎంత పని జరిగిందయ్యా! ఆ దేవుడికి మనమీద దయలేదు! నీ రెండు కాళ్ళూ తీసేశారయ్యా! ఆ దేవుడికి మనమీద దయలేదు! నీ రెండుకాళ్ళూ తీసేశారయ్యా!'' అంటు లక్షుమమ్మ భోరున ఏడ్చింది!

అది విని రాములు నిశ్చేష్టుడయ్యాడు!

''ఇక మనమెలా బ్రతికేది?'' లక్షువమ్మ గుండెలు బాదుకుంది!

''ఎందుకమ్మా ఏడుస్తావ్! సావాల్సిన మనిషి బతికాడు! దానికి సంతోషించు. పనిలో వుండగా ఈ గోరం జరిగిందిగా! మీకు డబ్బులొస్తాయిలే'' అన్నారు ప్రక్కనున్నవాళ్ళు!

ఆ మాటలు వినగానే వాళ్లిద్దరికి హఠాత్తుగా ఎప్పుడో మైసన్న చెప్పిన మాటలు గుర్తొచ్చాయి!

''ఆడికొక కాలు తీసేశారు! అందుకని ఆడికి లచ్చ ఇచ్చారు. తెల్సిందా?'' మైసన్న మాటలు వాళ్ల చెవుల్లో ప్రతిధ్వనించాయి. దాంతో ఇద్దరి దుఃఖం ఆగిపోయింది!

ఒక కాలుపోతే లచ్చ ఇస్తే రెండు కాళ్ళూ పోతే రెండు లచ్చలొస్తాయా?'' మనసులో లెక్కలేసుకుంటూ ఆనందించారు!

లక్షువమ్మ ఆ మర్నాడు అధికార్లను కలిసింది!

''మేమెందుకిస్తామమ్మా డబ్బులు... వాళ్ల అజాగ్రత్తవలన ప్రమాదం సంభవించింది. గనిలో వున్నప్పుడు జాగ్రత్తగా వుండాలని తెలియదా నీ మొగుడికి'' అంటూ లక్షువమ్మ మీదే మండిపడ్డారు ఆఫీసర్లు.

వాళ్లకసలే కార్మికులమీద కోపంగా వుంది. తమ మాటని ధిక్కరించి సమ్మె చేశారు! దానివలన తమకెంతో నష్టం కలిగింది! ప్రభుత్వంచేత చివాట్లు తినాల్సి వచ్చింది! తాము కార్మికులకు ఎంత చేస్తున్నా వాళ్లకి విశ్వాసం లేదు. ఎప్పుడూ తమని తిట్టిపోస్తూనే వుంటారు! మనసులో కార్మికులపై వున్న కోపమంతా లక్షువమ్మ మీద చూపారు అధికార్లు.

వాళ్ల మాటలు వినగాలే లక్షువమ్మకు పిచ్చెక్కినట్లయింది. అక్కడినుండి యూనియన్ లీడర్ల దగ్గరకు పరుగెత్తి... జరిగింది చెప్పింది.

సమ్మె విరమించుకుని ఆరోజే వాళ్లు పనులకు హాజరయ్యారు. వాళ్ల కోర్కెల్లో సగం మాత్రమే వెంటనే తీరుస్తామని ఒప్పుకుని మిగతా వాటి పరిష్కారానికి కొంత గడువు పెట్టింది ప్రభుత్వం!

చేసేదిలేక కార్మికులు విధులకు వెళ్లడానికి ఒప్పుకున్నారు.

''రాములు లాంటివాళ్లు నమ్మకద్రోహం చేసి పనిలోకి వెళ్లడంవల్లనే తమ సమ్మె పూర్తిగా విజయవంతం కాలేదు! వాళ్లే ఈ అనర్థానికి కారణం'' అంటూ నాయకులు లక్షువమ్మమీద మండిపడ్డారు.

చివరకు లక్షువమ్మ మైసన్న కాళ్లమీద పడింది.

''చూడమ్మా! నేనిప్పుడేం చెయ్యలేను. అటు అధికార్లు - ఇటు నాయకులు ఎవ్వరూ వినే స్థితిలో లేరు. మరొకప్పుడైతే నీ మొగుడికి డబ్బిచ్చి, నీ కొడుక్కి పనికూడా ఇచ్చేవారు! ఇప్పటి పరిస్థితి వేరు. నేను అతి కష్టం మీద పదివేలు పోగుచేసి ఇవ్వగలను. దానితో సరిపుచ్చుకోండి'' అన్నాడు.

వారం తర్వాత అన్నట్లుగానే పదివేలు వాళ్ల చేతిలో పెట్టాడు మైసన్న!

★ ★ ★

పై సంఘటన జరిగిన రెండు నెలల తర్వాత - రాములు తన పల్లెటూరుకు తిరిగొచ్చి ఐదువేలతో ఒక బడ్డీ కొట్టు పెట్టాడు. నెమ్మదిగా దేక్కుంటూ వెళ్లి ఆ కొట్లో కూర్చుంటాడు.

మిగతా ఐదువేలు పెట్టి కూతురుపెళ్లి చేశారు. ఇప్పుడు లక్షువమ్మ తన కొడుకుతో కలిసి పెద్ద దొరపొలంలోకి కూలీ పనికి పోతోంది!

నల్ల మబ్బుల్ని చూసి కుండలో నీటిని వదులుకుని మబ్బులవెంట పరుగెట్టి చివరికవి నీటిమబ్బులు కావని వట్టి తెల్లమబ్బులనీ తెలిశాక మళ్లీ కుండకోసం వచ్చారు అంటూ ఆ పల్లెటూరి పెద్దలు అప్పుడప్పుడు రాములు కుటుంబాన్ని చూసి జాలిపడుతుంటారు!

★ ★ ★

## పోలిక



''నీ భుజాలమీద అంత అస్తవ్యస్తమైనదేమిటి?'' అడిగాడు సురేష్.

''ఆ... ఆ... ఏమిటది?'' కంగారుపడ్డాడు వంశీ.

''నీ తలకాయ!'' చెప్పాడు సురేష్.

- పి.వి. మురళీకృష్ణ (హైదరాబాద్)